క్లుప్తంగా

వైవీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా ఆచార్య పుత్తా పద్మ



ఆచార్య పుత్తా పద్మకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, డీన్‌లు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ఆంగ్లశాఖ ఆచార్యులు డాక్టర్ పుత్తా పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలు ఆమెకు అందజేశారు. ఈ స్థానంలో ఇప్పటి వరకు పనిచేసిన ఆచార్య పి. షావల్లీఖాన్ కర్నూల్ ఉర్దూ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా నియమితులు కావడంతో ఆ స్థానంలో ఆచార్య పద్మను నియమించారు. ఆచార్య పద్మ వైవీయూ హాస్టల్స్ అడిషనల్ చీఫ్ వార్డన్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తారని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలి

కడప రూరల్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గిరిజన విద్యార్థుల ఉచిత విద్యకు ప్రవేశాలు కల్పించాలని గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సొరకాయల శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి నుంచి ప్రవేశాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే బోగస్ ఎస్టీ సరిఫికెట్స్‌తో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ కబ్జా మీద విచారణ జరిపించాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం 27వ డివిజన్ గౌస్‌నగర్ లో ఒకటిన్నర ఎకరా భూకబ్జా జరిగిందని వాటి మీద సర్వే చేసి విచారణ జరిపించాలని ముస్లిం మైనార్టీ నాయకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా, అమానుల్లాలు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కా ర వేదికలో వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌస్ నగర్‌లో అక్రమణకు గురైన భూమిపై సర్వే జరిపించాలన్నారు. అలాగే కడప నగరంలో చిన్న పాటి వర్షానికే రోడ్లన్నీ వంకలు లాగా తయారవుతున్నాయని, కార్పొరేషన్ పనితీరు బాగాలేదని తెలిపారు. ఈ విషయాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న మేయర్ కె.సురేష్‌బాబు

కడప స్పోర్ట్స్: ప్రొద్దుటూరు పట్టణంలో ఈనెల 21వ తేదీ నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన కడప నగరానికి చెందిన క్రీడాకారులను కడప నగర మేయర్ కె. సురేష్‌బాబు అభినందించారు. తైక్వాండో పోటీల్లో రుక్సానా, ఆయేషా, షిఫా, సాదియా, రెహమాన్, రాజు స్వర్ణపతకాలు సాధించగా, అలకనంద రజతం, జోహా కాంస్యపతకం సాధించినట్లు తైక్వాండో శిక్షకుడు జంషీర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మేయర్ అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రక్తదానం చేయడం బాధ్యతగా భావించాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో ఎస్‌ఐ తదితరులు

వైవీయూ: రక్తదానం చేయడం అన్నది అందరూ బాధ్యతగా భావించాలని కడప వన్‌టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన వారోత్సవాల్లో భాగంగా సోమవారం 3వరోజు కడప పాతబస్టాండులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రక్తం ఏ ప్రయోగశాలలో తయారుకాదని, కేవలం మనిషి మాత్రమే రక్తదానం చేస్తేనే ఆపదలో ఉన్నవారికి రక్తం అందుతుందన్నారు. కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్ష్మీదేవి, మదర్‌థెరిసా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు విజయకుమార్, జేబీవీఎస్ వ్యవస్థాపకుడు అశోక్, సీఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు సునీల్ జయంత్, ప్రసాద్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఉన్నతవిద్యకు ఊతమివ్వాలి..

కడప నగరంలో ఏర్పాటైన డా. వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి సొంతభవనాలు ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు కృషిచేయాలి. విద్యార్థులకు చదువుతో పాటు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు పొందేలా పరిశ్రమలను తీసుకురావాలి. యువతకు ఉద్యోగ నైపుణ్యాలు అందించేలా చర్యలు చేపట్టాలి.
- అవ్వారు దివ్యశ్రీ, విద్యార్థిని, కడప



ఐటీ పరిశ్రమలు తీసుకురావాలి..

కడప నగరానికి చెందిన యువత పెద్దపెద్ద నగరాలకు ఉద్యోగ అవకాశాల కోసం వెళ్లాల్సి వస్తోంది. పాలకులు స్పందించి కడప నగరానికి పరిశ్రమలతో పాటు మినీ ఐటీ పార్కులను తీసుకురావాలి. తద్వారా చదువుకున్న వారికి ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అదే విధంగా కడప నగరంలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.
- పట్టుపోగుల సుబ్బారావు, హ్యాండ్స్ ఫర్ యు స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపకుడు, కడప



రాష్ట్రంలో అన్ని నగరాల కంటే కడప అగ్రగామిగా తయారు కావాలని నగర వాసులు, యువత, మేధావులు కోరుకుంటున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో కొత్త ప్రభుత్వంపైన, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలపైన ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నారు.
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయడంతోపాటు, నూతన ప్రభుత్వం కొత్త స్కీములు తేవాలని వారు ఆకాంక్షిస్తున్నారు.



కడప నగరం అగ్రగామి కావాలి

ఎమ్మెల్యేలు గళమెత్తాలంటున్న నగరవాసులు

కడప కార్పొరేషన్: కడప నగరాభివృద్ధిపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నూతన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తి జిల్లా అభివృద్ధితో పాటు కడప నగరాన్ని అన్నింటా అగ్రగామిగా నిలపాలని కోరుకుంటున్నారు. కడప నగరంలో ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న రహదారుల విస్తరణ పూర్తయ్యింది. బాధితులకు నష్ట పరిహారం కూడా చెల్లించారు. కానీ అక్కడక్కడ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

– వర్షాకాలంలో కడప నగరాన్ని వరదతాకిడి నుంచి రక్షించడానికి వరదనీటి కాలువల నిర్మాణం చేపట్టారు. ఇవి కూడా అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. బుగ్గవంక సుందరీకరణలో భాగంగా రక్షణ గోడ నిర్మాణం గత ప్రభుత్వంలోనే పూర్తయ్యింది. దాని చుట్టూ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారు. కాగా రోడ్లు, కాలువల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. గుర్రాలగడ్డ, నాగరాజుపేటల వద్ద వంతెనల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇవన్నీ త్వరితగతిన పూర్తి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ప్రభుత్వాలు మారుతున్నా నగర శివారు ప్రాంతాల్లో ఎలాంటి మౌళిక వసతులు సమకూరలేదు. 200 లకు పైగా ఉన్న మురికివాడల్లో రోడ్లు, కాలువలు, తాగునీరు వంటి సమస్యలు పట్టి పీడిస్తున్నాయి.

– నగరం చుట్టు పక్కల ఉన్న పాతకడప చెరువు, బుడ్డాయపల్లె చెరువు, పక్కీరుపల్లె చెరువులను ఆధునీకరించాలని పనులు మొదలు పెట్టి చాలా వరకూ పూర్తి చేశారు. ఇవి త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. వేసవి కాలం వచ్చిందంటే కడపలో సగం ప్రాంతమంతా తాగునీటి సమస్యలతో అల్లాడాల్సి వస్తోంది. ఈ సమస్యను శాశ్వితంగా పరిష్కరించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రహ్మంసాగర్‌లో ఒక టీఎంసీ నికర జలాలను కడపకు కేటాయించారు. ఆ పనులు కూడా శర వేగంతో పూర్తి కావాల్సిన అవసరం ఉంది. కొప్పర్తి పారిశ్రామిక వాడలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రావాలంటే నీటి ఆవశ్యకత ఎంతో ఉంది. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మరిన్ని కొత్త పరిశ్రమలు రావాలన్నా, ఇప్పటికే ప్రారంభమైన పరిశ్రమలు మూతపడకుండా ఉండాలన్నా వాటికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది. కడప నగరంలో డ్రైనేజీ, మురుగు నీటి సమస్యలకు పరిష్కారం కల్పించాలని పలు వురు కోరుతున్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



కడప నగరంలో అండర్ డ్రైనేజీ అభివృద్ధి పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. అలాగే బుగ్గవంక సుందరీ కరణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా నగరంలోని రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. ఈ సమస్య పరిష్కరించాలి. వీటన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి.
- డీఎం ఓబులేస్ యాదవ్, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి...



కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలి. ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే రాయలసీమలో వలసలు ఉండవు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉక్కు పరిశ్రమకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి నిర్మించాలి.
- కన్నెలూరు శంకర్, ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి..



కడప నగరంలో చాలా వీధులలో చెత్త బండి ఇంటి వద్దకు రావడం లేదు. ఒక ప్రాంతంలో రోడ్డుపైన ఏర్పాటు చేసిన డబ్బాలో చెత్తను వేయమంటున్నారు. ఇదొక సమస్యగా మారింది. నగరంలో దోమలు ఎక్కువగా ఉన్నాయి. దోమ కాటు కారణంగా జ్వరాలు వస్తున్నాయి. కడప నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలి.
- వెంకట గంగాధర్ రెడ్డి, టైలర్, గుంత బజార్, కడప

రోడ్లను బాగు చేయాలి...



కడప నగరంలో కొన్ని రోడ్లు బాగాలేవు. వర్షం వస్తే రహదారులపై నీళ్లన్నీ నిలిచి పోతున్నాయి. కొన్ని చోట్ల రోజుల తరబడి నీరు అలాగే రోడ్లపై ఉంటున్నాయి. బాగాలేని ప్రాంతాల్లో తక్షణం రోడ్లను వేయాలి. మురుగు కాలువలు కూడా సమస్యగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు మురుగు కాలువలో ఉన్న చెత్త, చెదారాన్ని తొలగించాలి. ప్రధానంగా నగరానికి తగినట్లుగా రోడ్లను బాగు చేయాలి. పారిశుద్ధానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కరెంటు సమస్యలు పరిష్కరించాలి.
- అశోక్, ఎక్స్‌రే టెక్నీషియన్, సెవన్ రోడ్స్ సర్కిల్, కడప.

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి



కడప నగరంలో వేసవి కాలం వచ్చిందంటే మా ప్రాంతంలో నీటి సమస్య మొదలవుతుంది. నాలుగైదు రోజులకు ఒకసారి కూడా తాగునీరు సరఫరా కావు. గండి, లింగంపల్లి వాటర్ వర్క్స్ ద్వారా సరఫరా అయ్యే నీరు కడపలో పెరిగిన జనాభాకు సరిపోవడం లేదు. ఇందుకోసం గత ప్రభుత్వం బ్రహ్మం సాగర్ నుంచి కడపకు తీసుకురావడానికి ఏర్పాటు చేసిన పైపులైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి.
- డా. జె. ఉమామహేశ్వరరావు, మరియాపురం

పన్ను నిబంధనలు మార్చాలి

కడప ఎడ్యుకేషన్ : దేశంలో జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో పన్ను నిబంధనలను నేడు ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్లో మార్పు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం కడపలో ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పన్ను నిబంధనలు– తాజా బడ్జెట్ పై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి అమల్లో ఉన్న స్లాబులను సైతం తాజా ద్రవ్యోల్బణంకు అనుగుణంగా అందుబాటులోకి తేవాలని కోరారు. స్టాండర్డ్ డిడెక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని, పన్నులు లేని పరిమితిని ఐదు లక్షలకు పెంచాలని, పొదుపులు చేసుకునే అవకాశం రెండున్నర లక్షలకు పెంచుతూ సెక్షన్ 80 సీని విస్తృత పరచాలని డిమాండ్ చేశారు. ఏ పిటిఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల కార్యదర్శులు చెంగలరెడ్డి, అలీఖాన్ మాట్లాడుతూ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏలో ఉన్న సీలింగ్‌ను తొలగించి పాత లెక్కింపుల సూత్రాన్ని పెరిగిన ఆదాయ వనరుల ఆధారంగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ విద్య విశ్లేషకులు రాధాకృష్ణ మాట్లాడుతూ పాత కొత్త పన్ను విధానమంటూ ఉన్న లెక్కింపులను తొలగిస్తూ ఒకే విధానాన్ని అమలులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు ఉమాకాంత్ వీర ప్రసాద్‌తోపాటు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు

బాధితుడికి పరిహారం ఇవ్వాలి

కడప కార్పొరేషన్ : ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో వేడి నూనె పోయడం వల్ల తీవ్రంగా గాయపడిన కదిరి ప్రభాకర్‌కు రూ.20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ప్రజా సంఘాల నేతలతో కలిసి కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా కూడా ఇప్పటికీ అనేక గ్రామాల్లో కుల వివక్షతో దాడులు జరుగుతుండటం దారుణమన్నారు. తాము కూర్చొనే అరుగుపైన మాల వాడు కూర్చొన్నాడనే అగ్రవర్ణ అహంకారంతో గజ్జల వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తి కదిరి ప్రభాకర్‌పై దాడి చేసి కొట్టడమేగాక బజ్జీల కోసం కాచిన వేడి నూనెను అతని ఒంటిపై పోయడం మానవత్వానికి మాయని మచ్చ అన్నారు. వేడినూనె పోయడం వల్ల ఒళ్లంతా కాలిన బొబ్బలతో మంట.. మంట అంటూ రోదిస్తూ పది రోజులుగా ప్రభాకర్ రిమ్స్ హాస్పిటల్‌లో నరకయాతన అనుభవిస్తున్నాడన్నారు. కూలీ చేసుకుంటే తప్ప కుటుంబ జీవనం గడిచే పరిస్థితి లేని ప్రభాకర్ శరీరంలోని కొన్ని అవయవాలు పని చేయలేని స్థితికి చేరుకున్నాడని, భవిష్యత్‌లో అతను శారీరక కష్టం చేయలేడన్నారు. ఫలితంగా అతనిపై ఆధారపడిన భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డున పడాల్సిన పరిస్థితి దాపురించిందని, డిగ్రీ చదువుతున్న అతని కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, దళితుల ఆత్మ గౌరవం దెబ్బతినకుండా 3 ఎకరాలు సాగు భూమి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సగిలి గుర్రప్ప, బీసీ నాయకులు అవ్వారు మల్లికార్జున, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎల్.నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, చంద్రశేఖర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. పెరిగిపోతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాజకీయ నాయకుల వేధింపుల నుంచి కాపాడాలన్నారు. క్యాజువల్ సెలవులు, మెటర్నటీ సెలవులు ఇవ్వాలన్నారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారం కోసం చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఏఎఫ్‌యూ వీసీగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య జి. విశ్వనాథకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఆర్కిటెక్చర్ విభాగాధిపతిగా పని చేస్తున్న ఆచార్య జి. విశ్వనాథకుమార్‌ను ఏఎఫ్‌యూ ఇన్‌చార్జి వీసీగా నియమించిన విషయం తెలిసిందే. విశ్వవిద్యాలయానికి విచ్చేసిన ఆయనకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రగతికి కృషిచేస్తామని తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయ అధ్యాపకులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు.

రేపటి నుంచి అండర్‌–19 క్రికెట్ టోర్నమెంట్

24 నుంచి ఆగస్టు 19 వరకు నిర్వహణ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం క్రికెట్ మైదానాలు వేదికగా ఈనె 24 నుంచి ఆగస్టు 19వ తేదీ వరకు ఏసీఏ అండర్–19 మల్టీడేస్ అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో కడప, విశాఖపట్నం, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడనున్నాయి. ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ ప్రతినిధులు తెలిపారు. 24వ తేదీ వైఎస్‌ఆర్‌ఆర్ –ఏసీఏ మైదానం వేదికగా కడప, పశ్చిమ గోదావరి జట్ల మధ్య మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే అదే రోజు కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో విశాఖ, చిత్తూరు, కేఓఆర్‌ఎం మైదానంలో శ్రీకాకుళం, నెల్లూరు జట్లు తలపడతాయని వివరించారు.

బోధనా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి



టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు దండే పాల్

కడప ఎడ్యుకేషన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందించే శిక్షణ ద్వారా బోధనాభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధి, టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకులు దండేపాల్ సూచించారు. సోమవారం కడప నగరపాలక ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆల్టర్నేటివ్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, కోర్సు డైరెక్టర్ చల్లా విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన అభ్యసన ప్రక్రియలో మార్పులను ఉపాధ్యాయులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. అందులో భాగమే టీచ్ టూల్ కూడా అన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ శిక్షణను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సద్వినియోగం చేసుకొని తరగతి గదిలో విద్యార్థులకు వీటిని అమలు చేయడం ద్వారా ప్రభుత్వాలు ఆశించిన మేర విద్యార్థుల నుండి ఫలితాలను పొందవచ్చు అని పేర్కొన్నారు. కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి , ఏఎంఓ రామాంజనేయులు రెడ్డి, టీచ్ టూల్ జిల్లా అబ్జర్వర్ సాయిరాం, రిసోర్స్ పర్సన్‌లు గాయత్రి బాయ్, ఉమామహేశ్వరి, నాగమణి, కుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలి

వైవీయూ: ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్ సూచించారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్‌ను ధరించే విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని సూచించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శాంతి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక వనరులతో బోధనాభ్యసన ప్రక్రియ సాగించాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియ స్థానిక వనరులతో విద్యార్థులకు బోధించడం ద్వారా వారికి సులభంగా అర్థమౌతుందని కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈనెల 22 నుండి 28 వరకు నిర్వహించనున్న శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో మొదటి రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో టీఎల్‌ఎం మేళాను ఏర్పాటు చేశారు. డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి సంబంధిత టీఎల్‌ఎం మేళా ప్రదర్శన కార్యక్రమాన్ని తిలకించారు. విద్యార్థులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఈఆర్టీ సిబ్బంది పాల్, ఆల్టర్నేటివ్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ చల్లా విశ్వనాథరెడ్డి, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

రేపు వైవీయూలో జాబ్‌మేళా

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి తెలిపారు. టీసీఎల్, అపోలో ఫార్మసీ కంపెనీలు దాదాపు 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వస్తున్నట్లు తెలిపారు. టీసీఎల్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఫార్మా కంపెనీలో ఉద్యోగాల కోసం బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ చేసిన వారు అర్హులని తెలిపారు.

26న మహిళా డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 26వ తేదీన ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగానికి క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఏదైనా డిగ్రీ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9059066031 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తాండా ప్రజలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

కడప కార్పొరేషన్: చింతకొమ్మదిన్నె మండలం గురుంగుంపు తాండ గిరిజన వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డా. శివానాయక్, జిల్లా అధ్యక్షుడు జగన్ రాథోడ్ కోరారు. సోమవారం కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. జీఎన్‌ఎస్‌ఎస్ ముంపు కింద గురుంగుంపు తాండ గిరిజన వాసులకు కేవలం 5 సెంట్లు ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. కానీ వారికి ఇంటి నిర్మాణానికి కావలసిన డబ్బులు, ఇంటి స్థలం పట్టాలు కానీ ఇప్పటికీ మంజూరు కాలేదు. గిరిజన ప్రజానీకానికి మంజూరు చేయవలసిన అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తూ వీలైనంత తొందరగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండ వాసులు గోపి నాయక్, చక్రీ నాయక్, మల్లె నాయక్, భాస్కర్ నాయక్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరప్రదేశ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ఆక్సిస్ బ్యాంకులలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసేందుకు డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ. 25–33 వేల వేతనంతోపాటు ఇన్సెంటివ్ లభిస్తుందన్నారు. అభ్యర్థులు 19–28 మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఏపీ, తెలంగాణలలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందన్నారు. భారత్ ఫైనాన్సియల్ ఇన్‌క్యూసన్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్‌గా ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. అలాగే నవ భారత్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, పే టీమ్ సేల్స్ రిప్రజంటేటివ్ పోస్టులకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజీవ్ పార్క్ సమీపంలో ఈనెల 20న రాత్రి సమయంలో వాహనాల తనిఖీలలో తమ సహచర న్యాయవాది, మాజీ జీ.పి జి. గుర్రప్ప కుమారుడు నవదీప్‌పై దాడి చేసిన ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిపై చర్యలను తీసుకోవాలని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి. గుర్రప్ప నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో కడప బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప బార్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ ఎస్‌ఐ దాడి చేసినప్పటి నుంచి న్యాయవాది గుర్రప్ప కుమారుడు తీవ్ర అస్వస్థతతో వున్నాడని, విచక్షణా రహితంగా దాడి చేసిన ఎస్‌ఐపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

వసతులను కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. సోమవారం కడప నగరం చిన్న చౌక్‌లోగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను (బాలికలు) ఆయన విజిట్ చేశారు.